క్లుప్తంగా

క్రీడా విజేతలకు అభినందనలు

దాబాగార్డెన్స్: క్రీడలు మనలో ప్రతిభ వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడతాయని, వాటి ద్వారా దేశానికి సేవ చేయొచ్చని సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఆశ జాస్తి, నిత్య జాస్తి పేర్కొన్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్–3 విజేతగా నిలిచిన ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఆరెంజ్ క్యాప్ విన్నర్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్న కె. అశ్విన్ హెబ్బార్‌కు రూ.లక్ష, పర్పుల్ క్యాప్ విన్నర్ సుదర్శన్ కొదవండ్లకు రూ.లక్ష బహుమతిని సన్ ఇనిస్టిట్యూట్ ద్వారా అందజేసినట్లు తెలిపారు. విశాఖలో క్రీడాకారులకు కొదవ లేదని ఈ వారు తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సామాజిక అంశాలు, వ్యక్తిగత ఎదుగుదలకు తామెప్పుడూ ప్రోత్సహిస్తామని వెల్లడించారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు పూజలు చేస్తున్న పూజారమ్మ

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

దాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి వైద్య సేవలు పొందారు. ముఖ్యంగా జలుబు, జ్వరాలు, దగ్గు తదితర వ్యాధులకు గురైన వారు ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ జీవీ రామ్ వైద్య పరీక్షలు నిర్వహించి తగు సలహాలు, సూచనలు అందజేశారు. పరీక్షల్లో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేశారు. స్వర్ణకార సంఘం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పక్కి కొండబాబు, ఫణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

మసీదు ద్వారం నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే వంశీని మర్యాదపూర్వకంగా కలిసిన కామాషోలి బాబా దర్గా ప్రతినిధులు

అల్లిపురం: యాతపేటలో గల హజరత్ కామాషోలి బాబా దర్గాకు స్వాగత ద్వారం నిర్మించేందుకు జీవీఎంసీ నుంచి అనుమతులు ఇప్పించాలని దర్గా ప్రతినిధులు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు వారు ఆదివారం అతని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన తప్పకుండా జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి అనుమతులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దర్గా ప్రతినిధులు షేక్ అన్సార్, షేక్ మదీనా, షేక్ హుస్సేన్, షేక్ యాసిన్ కృతజ్ఞతలు తెలిపారు.

నాడు ఘనం.. నేడు దైన్యం



35వ వార్డులోని ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రం

- వెలవెలబోతున్న పట్టణ ఆరోగ్య కేంద్రాలు
- రోగులకు అందని వైద్య సేవలు
- కేవలం రక్త పరీక్షలతోనే సరిపెట్టేస్తున్న వైనం
- 'ఇంటి వద్దకే వైద్యం' అనే నినాదం ముగిసిపోయిందని పేదల ఆవేదన

జగదాంబ: నాడు రోగులకు నిత్యం వైద్య సేవలందిస్తూ కిటకిటలాడిన ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు నేడు వెలవెలబోతున్నాయి. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదలకు వైద్య సేవలు చేరువ చేసే సంకల్పంతో వార్డుల్లోని ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలతో పాటు వైద్యులు, మందులు, రక్త పరీక్షలు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పేదల వైద్యానికి ఢోకా లేకుండా పోయేది. ఓపీ రోగులు కూడా ఎక్కువ సంఖ్యలో వచ్చేవారు. ఇదంతా నాటి పరిస్థితి.. నేడు చాలా వార్డుల్లోని ఆరోగ్య కేంద్రాలు పాత పద్ధతికే చేరుకున్నాయని ఆయా ప్రాంతాల స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడు ఆరోగ్య కేంద్రాల్లో కేవలం షుగర్, బీపీ వంటి పరీక్షలు తప్ప మిగిలిన ఏ వైద్య సేవలు అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్దకే వైద్యం అనే నినాదం ముగిసిపోయిందని వృద్ధులు బాధపడుతున్నారు.

కానరాని 40కి పైగా పరీక్షలు..

ఆరోగ్య కేంద్రాల్లో హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్స్ సంఖ్య, మలేరియా పరీక్ష, గర్భ నిర్ధారణ పరీక్ష, రక్తం చెక్కర పరీక్ష (ర్యాండమ్), హెచ్‌ఐవీ పరీక్ష, రక్తం యూరియా పరీక్ష, సీరమ్ క్రియాటినిన్ పరీక్ష, కొలెస్టరాల్, డెంగ్యూ వంటి పలు పరీక్షలు ఆరోగ్య కేంద్రాల్లో చేసేవారు. కానీ ఇప్పుడు ఆ పరీక్షలు అందటం లేదని ప్రజలు వాపోతున్నారు.

పలు సేవలకు విఘాతం..

నాడు ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం నుంచి శనివారం వరకు పలువురు వైద్య నిపుణులు సేవలందించేవారు. ప్రసూతి, ఎముకలు, చిన్నపిల్లల వైద్యులు, చర్మవ్యాధుల నిపుణులు, ఈఎన్‌టీ, జనరల్, కార్డియాలజిస్టులు రోజుకొకరు చొప్పున వచ్చేవారు. రోగులకు అవసరమైన సేవలు అందించేవారు. దీంతో రోగులు కూడా క్రమం తప్పకుండా స్పెషలిస్ట్ వైద్యులను కలిసి వైద్యం పొందేవారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత పలు ఆరోగ్య కేంద్రాల్లో ఈ తరహా సేవలకు విఘాతం కలిగినట్లు ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు.

పేదవాడు ఏ రకంగానూ ఇబ్బంది పడకూడదని నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బలంగా భావించింది. జీవితావసరాలకు కావలసిన అన్ని వనరులను ప్రతి వ్యక్తి సులువుగా పొందేలా ప్రతి ఒక్కటి అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్య, వైద్యం, పాలనాపరమైన సేవలు.. ఒకటేమిటి పేద, మధ్య తరగతి ప్రజలు ఏది పొందాలంటే కష్టమనుకుంటారో అవన్నీ వారి కాళ్ల వద్దకే తీసుకెళ్లింది. అందులో ముఖ్యమైనది వైద్యం.. ప్రతి పేదవాడికి ఉచిత వైద్యం పొందే హక్కు ఉందని భావించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డుల్లోనే ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయి పరీక్షలు.. వైద్యం అందజేసింది. ఈ సేవల వల్ల పేదలు ఉన్న చోటే చక్కటి వైద్యం పొందారు. ఏనాడూ చూడని స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలందుకున్నారు. కానీ నేడు ఆ పరిస్థితి మెల్లగా కనుమరుగైపోతోందని.. ఆ పేదలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లోని ఆరోగ్య కేంద్రాల్లో సేవలు మసకబారుతున్నాయని చెబుతున్నారు. మళ్లీ అవే బాధలు తప్పవేమో అని భయపడుతున్నారు.

మళ్లీ అవే బాధలు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దే వైద్యం పొందేవాళ్లం. ఇప్పుడు ఆ సేవలు లేవు. వారమంతా ఆస్పత్రికి వచ్చే డాక్టర్లు ఇప్పుడు రావడంలేదు. ఒకే డాక్టర్ ఉంటున్నారు. మళ్లీ అవే బాధలు వచ్చాయి. మాలాంటి వృద్ధులం ఇబ్బందులు పడుతున్నాం.

–దళాయి ఈశ్వరమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు.

అన్ని పరీక్షలు ఉచితంగానే చేసేవారు..



గతంలో అన్ని వ్యాధులకు ఉచిత పరీక్షలు చేసేవారు. ఇప్పుడు బీపీ, షుగర్ పరీక్షలు తప్ప మరే పరీక్షలు లేవంటున్నారు. ఇలా అయితే మాలాంటి పేద రోగుల పరిస్థితి ఏమిటి? గతంలో లాగే పరీక్షలన్నీ చేసి ఉచితంగా మందులు ఇవ్వాలి.

–యాండ్రపు సన్యాసిరావు, చిలకవీధి, 39వ వార్డు

డబ్బులిచ్చి వైద్యం చేయించుకోలేం..



ఏ ప్రభుత్వం అయినా పేద ప్రజల కోసమే పని చేయాలి. ఈ ప్రభుత్వం కూడా పేదల కోసం ఆస్పత్రుల్లో డాక్టర్లు, సదుపాయాలు కల్పించాలి. లేకపోతే మాలాంటి పేదోళ్లం డబ్బులిచ్చి వైద్యం చేయించుకోలేం.

– వియ్యపు అప్పలకొండ, దుర్గమాంబ సమాజం, 35వ వార్డు

ఆడపిల్లల ఆరోగ్యం పట్ల తల్లులు శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న గైనకాలజిస్ట్ డాక్టర్ సౌదామిని

అల్లిపురం: ఆడపిల్లల ఆరోగ్యం పట్ల తల్లులు శ్రద్ధ వహించాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బి.సౌదామిని అన్నారు. ముఖ్యంగా ఆడవాళ్లు ఇంట్లో పనులతో పాటు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలిసి గౌరీపరమేశ్వరుల చిత్రపటం వద్ద దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమెను గ్రంథాలయ మహిళలు సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు తమ పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించాలన్నారు. వారిలో వచ్చే మార్పులు గమనిస్తూ, వారికి పౌష్టికాహారం అందజేయాలన్నారు. పిల్లలతో పాటు మహిళలు కూడా వారి వయసు రీత్యా కాల్షియం, విటమిన్–డి తీసుకోవాలన్నారు. అనంతరం మహిళలను పరిశీలించి వారికి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గుడ్డ సంచులే మేలు

దాబాగార్డెన్స్: గుడ్డ సంచులు వాడి పర్యావరణాన్ని కాపాడాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోరుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఇప్పటి వరకు 5 వేల వరకు గుడ్డ సంచులు అందజేసింది. పదివేల గుడ్డ సంచులు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా 10 వేల గుడ్డ సంచుల పంపిణీకి శ్రీకారం చుట్టిన స్వామి వివేకానంద సంస్థను అభినందించారు. సంస్థ నిత్యం నిర్వహిస్తున్న అన్నదానం, సంస్థ సేవలను కొనియాడారు. సంస్థకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, గజపతి స్వామి, సీహెచ్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇంజక్షన్ల పంపిణీ

మహారాణిపేట: హిమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మహారాణిపేటలో ఉన్న ఇంటాస్ ఫౌండేషన్ ఉచిత ఇంజెక్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పంపిణీని ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖరం మాట్లాడుతూ హిమోఫిలియా జన్యుపరమైన రక్త సంబంధిత వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి ఉన్న వారికి గాయాలైతే రక్తం గడ్డకట్టడానికి ఎక్కువ సమయం తీసుకుంటుందన్నారు. ఇప్పుడు పంపిణీ చేస్తున్న వేలాది రూపాయలు ఖరీదు చేసే ఇంజెక్షన్ మాత్రమే దానికి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సాయిబాబు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పరమాత్ముని దయతోనే జీవన్ముక్తి



సంత్ సమాగంలో పాల్గొన్న మహిళలు



సందేశమిస్తున్న సద్గురు మాతా సుదీక్షా సత్య

దాబాగార్డెన్స్: పాతనగరంలో ఆదివారం సంత్ నిరంకారీ మిషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంత్ సమాగం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ జోనల్ ఇన్‌చార్జి మోహినీ అహూజా సందేశమిచ్చారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం నుంచే కాక తూర్పు, పశ్చిమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, సంత్ నిరంకారీ మిషన్ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాగంలో పలువురు మహిళలు లఘు నాటికలు, కవితలు, నృత్య గానాలు, బృందగానాలు, ఉపన్యాసాలిచ్చారు. అనంతరం సంత్ నిరంకారీ మిషన్ సద్గురు మాతా సుదీక్షా సత్య తెలుగు, హిందీ, మరాఠీ, ఒరియా, పంజాబీ, భోజ్ భాషల్లో ప్రసంగించారు. మానవ జీవిత లక్ష్యం, ప్రభు ప్రాప్తి, బ్రహ్మజ్ఞాన ఉపదేశాలకు సంబంధించి తెలిపారు. నేను ఎక్కడి నుంచి వచ్చాను.. ఎక్కడికి వెళ్లగలను అనే సత్యం గ్రహించి సద్గురు ద్వారా బ్రహ్మజ్ఞానం పొందాలన్నారు. పరమాత్మతో అనుసంధానమైన నామస్మరణ ద్వారా నిరంకారునితో యోగమై పరమాత్మునితో జీవించి జీవన ముక్తి పొందాలన్నారు. సంత్ సమాగంలో ప్రేమ్ రాంచంద్, పీవీ రావు, పీఎస్ఎన్ రాజు, రాజ్‌వీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు 'కల్కి' చిత్రం చూపించిన అమిగోస్ సంస్థ



అనాథ పిల్లలతో సీపీ శంఖబ్రత బాగ్చీ, జేసీఐ వైజాగ్ పోర్టు అమిగోస్ సభ్యులు

దాబాగార్డెన్స్: జేసీఐ వైజాగ్ పోర్టు అమిగోస్ సంస్థ 120 మంది అనాథ పిల్లల్లో ఆనందం నింపేందుకు ఉచితంగా 'కల్కి' సినిమాకు తీసుకెళ్లింది. ప్రభాస్, దీపిక పదుకొనే, అమితాబ్ బచ్చన్ ముఖ్యపాత్రల్లో నటించిన ఈ చిత్రం చూసిన చిన్నారులు ఆ చిత్రం మహాభారతం నేపథ్యం కలిగి ఉండటంతో నీతి, విలువల గురించి తెలుసుకోలిగారు. నగరంలోని రామాటాకీస్, జగదాంబ కాంప్లెక్స్ థియేటర్లలో ఆదివారం ఈ సినిమా ప్రదర్శించారు. పిల్లలు ఈ సినిమా చూసేందుకు ఉత్సాహం చూపారు. కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని పిల్లలతో కాసేపు ముచ్చటించారు. కొంతసేపు వారితో కలిసి చిత్రాన్ని వీక్షించారు. జేసీఐ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాథలకు ఆహ్లాదకరమైన విద్య, వినోదం అందించడానికి జేసీఐ వైజాగ్ పోర్టు అమిగోస్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సినిమా నుంచి విలువైన పాఠాలు, నీతి పిల్లలు నేర్చుకోగలరని, వారు చిత్తశుద్ధి, కరుణతో జీవించడానికి ప్రేరణ పొందాలని సంస్థ భావించడం గొప్ప విషయమన్నారు. సంస్థ అధ్యక్షుడు భార్గవ్ మహర్షి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, మాధురి సామినేని, చంద్రమౌళి, సాయి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు



యక్షిణీ దీప కాంతుల్లో రాజశ్యామల, అనఘాలక్ష్మీదేవి, వారాహి అమ్మవార్లు



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: అల్లిపురంలోని వివేకానంద కాలనీలో గల శ్రీ సాయిదర్బార్ ప్రాంగణంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. శ్రీ సాయి శ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్వ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి శైవాగమ సాంప్రదాయంలో మంగళ ధ్వని, వేద మంత్రాలతో ఆలయ అర్చకుడు పవన్‌శర్మ భక్తుల సమక్షంలో యక్షిణీ దీపం వెలిగించారు. ముందుగా విఘ్నేశ్వర పూజను ఆచరించి ఆలయంలో వెలసిన అనఘా లక్ష్మీదేవి, రాజశ్యామలాదేవి, వారాహి అమ్మవార్లను అభిషేకించారు. అనంతరం వెండి, నూతన వస్త్రాలు, రకరకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, అష్టోత్తర సహస్రనామార్చన, షోడశ లక్ష్మీ పూజ జరిపించారు. పూర్ణాహుతి కార్యక్రమంతో నవరాత్రి ఉత్సవాలు ముగిసాయని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ప్రసన్న, కార్యదర్శి శ్రీనివాస సుబ్రహ్మణ్య శాస్త్రి, స్వప్న, లత, రాజేశ్వరి, పద్మజ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు



తొలి పావంచా వద్ద ట్రాఫిక్ నియంత్రణపై చర్చిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

- గిరిప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం: గిరి ప్రదక్షిణ రోజు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా భక్తులు బయలు దేరే కొండదిగువ శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలసి నార్త్ ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. భక్తులు తొలిపావంచా వద్దే కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణ ప్రారంభిస్తారు. దీంతో ఆప్రదేశంలో ఏర్పాటు చేయాల్సిన క్యూలు, భక్తుల మధ్య తోపులాటలు లేకుండా చేయాల్సిన ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కొబ్బరికాయలు కొట్టేందుకు ఎన్ని ర్యాంపులు వేయాలో పరిశీలన చేశారు. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన ప్రాంతాలను గుర్తించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో పుస్తకాల పంపిణీ



పిల్లలకు నోట్ బుక్స్ అందిస్తున్న ప్రభాస్ వైజాగ్ సిటీ వైడ్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: సినీనటుడు ప్రభాస్ నటించిన 'కల్కి' సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ.1000 కోట్లు కలెక్షన్స్ సాధించిన సందర్భంగా వైజాగ్ సిటీ వైడ్ ఫ్యాన్స్ అసోసియేషన్ వేడుకలు నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివారం జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో ఆనంద్ మార్గ్ ఆశ్రమంలో పిల్లలకు అసోసియేషన్ సభ్యులు నోట్ బుక్స్, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం పిల్లల మధ్య అన్నపూర్ణ పిక్చర్స్ డిస్ట్రిబ్యూషన్స్ ప్రతినిధి సుబ్బయ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌మార్గ్ ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవదూత అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌వర్మ, పృధ్వీ, నూకరాజు, తోటరాజు, రెడ్డి, శివ పాల్గొన్నారు.

జూలో కొత్త వన్యప్రాణుల సందడి



గ్రీన్ వింగ్డ్ మెకావ్



సల్ఫర్ క్రెస్టెడ్ కాకటూ



ఎన్‌క్లోజర్‌లో మీర్‌కాట్

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొత్త వన్యప్రాణులు సందడి చేస్తున్నాయి. జూకు వచ్చిన సందర్శకులను అలరిస్తున్నాయి. ఈ నెల 2న గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి పలు వన్యప్రాణులను విశాఖ జూకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ వన్యప్రాణులు ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ, అరుస్తూ సందడి చేస్తున్నాయి. రెండు జతల గ్రీన్ వింగ్డ్ మెకావ్, రెండు జతల స్కార్లెట్ మెకావ్స్, రెండు జతల మిలటరీ మెకావ్స్, రెండు జతల మీడియం సల్ఫర్ క్రెస్టెడ్ కాకటూ, రెండు జతల స్పైడరల్ మంకీస్, రెండు జతల కామన్ మార్మోసెట్స్, ఒక జత మీర్‌కాట్, ఒక జత రెడ్ నెక్డ్ వాల్లబీని జంతు మార్పిడి విధానంలో జూ అధికారులు ఇక్కడికి తీసుకొచ్చారు. జూకి వెళ్తున్న సందర్శకులకు ఇవి కనువిందు చేస్తున్నాయి. ఆదివారం సెలవు కావడంతో అధిక సంఖ్యలో పిల్లలు, పెద్దలు జూ పార్కును సందర్శించారు. గ్రీన్ వింగ్డ్ మెకావ్ స్కార్లెట్ మెకావ్స్, మిలటరీ మెకావ్స్, మీడియం సల్ఫర్ క్రెస్టెడ్ కాకటూ పక్షులను జూలో ఆఫ్రికన్ బర్డ్స్ జోన్‌లో అద్దాల ఎన్‌క్లోజర్లలో ఉంచారు. మీర్‌కాట్‌లను సింహాల ఎన్‌క్లోజరు పక్కన ప్రత్యేకంగా నిర్మించిన అద్దాల ఎన్‌క్లోజర్‌లో పెట్టారు. రెడ్‌నెక్డ్ వాల్లబీలను ఆస్ట్రిచ్‌ల పక్కన ఎన్‌క్లోజరులో విడిచిపెట్టారు. స్పైడరల్ మంకీస్, కామన్ మార్మోసెట్స్‌లను కోతుల జోన్‌లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఎన్‌క్లోజర్లలో ఉంచారు. సందర్శకులు ఆయా కొత్త వన్యప్రాణులను ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ వన్యప్రాణులు కొత్తవి కావడంతో పాటు అద్దాల ఎన్‌క్లోజర్లలో స్పష్టంగా కనిపిస్తున్నాయని సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొత్త పక్షుల ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకులు

గౌరీ సేవా సమితి నూతన కార్యవర్గం

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం శ్రీగౌరీ సంక్షేమ సేవా సమితి వార్షిక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 2024–2026 కాలపరిమితికి నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. కాండ్రేగుల సూర్యనారాయణ, డి.కె.ఎ.సత్యనారాయణ, పి.రామారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమితి నూతన అధ్యక్షుడిగా పిల్లా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మళ్ల రామకృష్ణ, కార్యదర్శిగా కాళ్ల వెంకట్‌ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా కొణతాల రమణప్రసాద్, కోశాధికారిగా వేగి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా రాపేటి రామారావు, బి.వి. సత్యనారాయణ, రాపేటి వెంకటరమణ, ఆళ్ల నూకఅప్పారావు, పి.సుధాకర్, భీమరశెట్టి రామకృష్ణ, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాస్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.